**జరిగిన కథ :** కొత్త నాట్య సంప్రదాయాలను సృష్టించడం.. దేశీ సాహిత్యాన్ని సేకరించడంలో మునిగిపోయాడు జాయపుడు. ఇలా ఉండగా.. ఒకనాడు వేగులు వచ్చి జాయపునికి ఓ లేఖ అందించారు. యుద్ధ మంత్రాంగ మందిరానికి రావాల్సిందిగా పృథ్వీశ్వరుడు పంపిన ఆ లేఖను చూసి ఆశ్చర్యపోయాడు. ధనదుపురం చేరి.. మంత్రాంగ మందిరంలో ప్రవేశించాడు. మండలేశ్వరుడి సింహాసనం ఖాళీగా ఉంది. పక్కనున్న మరో ఉన్నతాసనంపై పృథ్వీశ్వరుడు కూర్చుని ఉండగా.. ఆ పక్క ఆసనాలపై సంధివిగ్రహి, మహామంత్రి, సర్వసైన్యాధ్యక్షుడు మరికొందరు ఆసీనులై ఉన్నారు. కాస్త అవతలగా పల్యంకాలపై పూర్తి శైవమత ఆహార్యంతో కనిపిస్తున్నవారు కూర్చుని ఉన్నారు. మందిరమంతా కాస్త గంభీరంగా ఉంది.



# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జాయపుని** ప్రవేశంతో అంతా గౌరవంగా లేచి నిలబడ్డారు.. పృథ్వీశ్వరునితో సహా. చాలాకాలంగా రాచ సంప్రదాయాలకు ఆమడదూరంలో తిరుగాడుతున్న జాయపుడు కొంచెం కంగారుపడి..

''మీరు కూర్చోండి అన్నా..'' అన్నాడు అప్రయత్నంగా.

జాయపుని సంగతి తెలిసిన పృథ్వీశ్వరుని ముఖాన్ని చూసి.. సంగతి గ్రహించిన జాయపుడు నాలుక కొరుక్కున్నాడు.

'ఔను.. నేను కదూ మండలేశ్వరుడ్ని..'

వేగంగా వెళ్లి మండలేశ్వరుని ఆసనంలో కూర్చున్నాడు. కాస్త కుదుటపడ్డాడు. మందిరాన్నంతా కలియజూశాడు.

''మహామంత్రీ.. ఏమిటి విషయం?!''.

మహామంత్రి దేవోజు లేచి వినమ్రంగా నమస్కరించి నిలబడ్డాడు.. కానీ, పృథ్వీశ్వరుని వంక చూశాడు.

కాస్త వరసలో పడ్డాడు జాయపుడు.

''మీరు వివరించండి అన్నా!''.

పృథ్వీశ్వరుడు లేచి వినయంగా నమస్కరించి చెప్పాడు.

''కాకతీయ సామ్రాజ్యంలో ఈమధ్య మతఘర్షణలు ఎక్కువయ్యాయి మండలేశ్వరా! అవి మతాల మతాల మధ్య గొడవలుగా భావించి పట్టించుకోలేదు. మహా మండలేశ్వరులు కూడా అవి రాజ్యపాలనాంశాలు కావన్న భావనతో ఉన్నారు కానీ, అవి పెరిగిపెరిగి ఇప్పుడు రాజ్యపాలకులు కూడా ఈ మత ప్రభావాలకు లోనై.. పక్క రాజ్య మహారాజులను కూడా ఈసడిస్తూ వీధి గొడవలకు దిగడం.. ఎంత దిగజారుడు తనమంటే..''

ఘడియఘడియకు అన్న గొంతులో పెరుగుతున్న అసహనపు ఉద్రిక్తత జాయపుడు గమనిస్తున్నాడు.

''మన పక్కనున్న అద్దంకి రాజ్యానికి, పాకనాడు రాజ్యానికి మధ్య ఈ మతగొడవల వల్ల పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటున్నది. ఇప్పుడు ఇద్దరూ యుద్ధానికి సిద్ధమయ్యారు!''.

''యుద్ధానికా.. శివ శివా! ఇది మహామండలేశ్వరులకు తెలుసా..?''.

''వాళ్లు తెలియజేయలేదు. వేగులవాళ్లు ఆయన చెవిన వేశారు. ఆయన ఆ గొడవ ఏమిటో చూడమని మనకు ఆదేశించారు. నేను వెంటనే సమస్య ఏమిటో తెలుసుకున్నాను. రెండురాజ్యాల మధ్యనున్న తటస్థ గ్రామం చిగురుపాడులో ఓ దేవాలయం నిర్మించారు. నిజానికి అది పాడుపడిన బౌద్ధాలయం. అందులో శైవులు రుద్రుని విగ్రహం ప్రతిష్ఠించి పూజాదికాలు